చైనాలో డాక్టర్ కోట్నీస్



డాక్టర్ ద్వారాకానాథ్ శాంతారాం కోట్నిస్ భారతీయ డాక్టరు. జపానుతో యుద్ధం చేస్తున్న చైనా ప్రజలకి సహాయం చెయ్యటానికి 1938 సెప్టెంబరులో చైనా వెళ్లిన వైద్య బృందంలో అతను ఒకడు. చైనాలో ఉన్న అయిదేళ్ల కాలంలో గాయపడిన వేలాది సైనికులకు, పౌరులకు అతను వైద్యం చేశాడు. చైనా జాతీయ విముక్తికి అతను అంకితం అయ్యాడు. అనారోగ్యం, పని భారం కారణంగా అతను యుద్ధరంగంలో చనిపోయాడు. డాక్టర్ కోట్నిస్ సాహసం, విప్లవ స్ఫూర్తి, అంతర్జాతీయతలకు ఈ పుస్తకం నివాళులు అర్పిస్తోంది.

చైనాలో డాక్టర్ కోట్నిస్

కథనం: షెంగ్ జియాంగాంగ్

బొమ్మలు: జిన్ హెడె

మొదటి ముద్రణ 1987

పేపర్‌బ్యాక్: ISBN 0-8351-1899-1

డాల్ఫిన్ బుక్స్, 24 బైవాన్‌ఝువాంగ్ వీధి, బీజింగ్, చైనా ద్వారా ప్రచురితం

చైనా ఇంటర్నేషనల్ బుక్ ట్రేడింగ్ కార్పొరేషన్ (గువోజి షుడియన్), పోస్ట్ బాక్స్ 399, బీజింగ్, చైనా ద్వారా పంపిణి

పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో ముద్రితం




అది మహారాష్ట్రలోని షోలాపుర్ అనే చిన్న పట్టణం. 1910 సంవత్సరం, అక్టోబరు 9. రాత్రి నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అప్పుడే పుట్టిన పిల్లవాడి ఏడుపు వినిపించింది. ద్వారాకానాథ్ శాంతారాం కోట్నిస్ పుట్టాడు.




ఒక సంపన్న కుటుంబంలో కోట్నీస్ పుట్టాడు. స్థానిక నూలు మిల్లులో అతని తండ్రి శాంతారాం కోట్నీస్ సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. అతని తల్లి గృహిణి. ఆ ఇద్దరూ దయాహృదయులు. పేదవాళ్లకి సహాయం చెయ్యటం వాళ్లు కొడుకుకి నేర్పించారు.




తల్లిదండ్రుల ప్రభావంతో ఇతరులకు సహాయం చేసే మంచి అలవాట్లను కోట్నీస్ అలవర్చుకున్నాడు. ఒక వేసవి రోజు, కోట్నీస్, అతని బావ బాల్కనీలో కూర్చుని ఉన్నారు. ఉన్నట్టుండి అతని బావ పక్కవాళ్ల ఇంటి కప్పుపై పడిపోయాడు. ఏమాత్రం తటపటాయించకుండా కప్పు మీదకి దూకి బావ చెయ్యి అందుకుని, అతను కిందకి పడిపోకుండా కోట్నీస్ కాపాడాడు.




కోట్నిస్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్నప్పుడు భారత దేశం ఇంకా బ్రిటిష్ వలసపాలన కిందే ఉంది. మహాత్మా గాంధి మొదలుపెట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంలో అతను పాల్గొన్నాడు. విదేశీ వస్తువులు తగలబెట్టే కార్యక్రమానికి నాన్న, అన్నలతోపాటు కోట్నిస్ కూడా వెళ్లాడు. అప్పటి నుంచి అతను స్వదేశీ నూలు బట్టలనే వేసుకోసాగాడు.




1932లో షోలాపుర్‌లో కొంతమంది దేశభక్తులను వలసవాదులు చంపేశారు. కోట్నిస్ కోపంతో రగిలిపోయాడు. తోటి విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శనని నిర్వహించాడు.



క్షమాపణ చెప్పటానికి కోట్నిస్ ఒప్పుకోకపోవటంతో అతనిని కళాశాల నుంచి తొలగించారు.



అప్పుడు అతను ముంబయిలోని గ్రాంట్ మెడికల్ కళాశాలలో చేరి, 1936లో పట్టా పొందాడు. జీవితంలో స్థిరపడి, పెళ్లి గురించి ఆలోచిస్తాడని అతని అమ్మానాన్నలు అనుకున్నారు. కానీ, అతను చదువు కొనసాగించి, సర్జన్ కావాలని అనుకున్నాడు.




పట్టా పొందిన తరవాత అతనిని ఫిజియాలజీ విభాగంలో సహాయకుడిగా చేరమని అడిగారు. అది మంచి ఉద్యోగం కిందే లెక్క. కానీ, తన పనితో అతను సంతృప్తి చెందలేదు. వైద్య ఖర్చులు భరించలేక పేద ప్రజలు రోగాలతో బాధపడుతున్నారని తెలుసుకుని అతను ఆవేదన చెందాడు. "ఇలా ఎందుకు ఉంది?" అని ప్రశ్నించకుండా ఉండలేకపోయాడు.




ఉన్నత పట్టా పొందటానికి పరీక్ష తేదీ దగ్గరలోనే ఉంది. కానీ, అదే సమయంలో జపానుకి వ్యతిరేకంగా చైనా ప్రజలు చేస్తున్న యుద్ధంలో సహాయపడటానికి ఒక వైద్యుల బృందం కావాలని భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ పిలుపునిచ్చారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పరీక్షను పక్కనపెట్టి చైనా సహాయక సంఘానికి కోట్నిస్ దరఖాస్తు చేశాడు.




చైనాకి వెళ్లటం అంటే ప్రాణాన్ని పణంగా పెట్టటం, పై చదువులు వదులుకోవటం కాబట్టి జాగ్రత్తగా ఆలోచించుకోమని చైనా సహాయక సంఘ అధ్యక్షుడు సలహా ఇచ్చాడు. "నేను దీనినే ఎంచుకున్నాను," అని కోట్నిస్ ఉత్సాహంగా బదులు ఇచ్చాడు. చైనాకి వెళ్లే వైద్య బృందంలో అతనిని తీసుకున్నారు.



వీడ్కోలు చెప్పటానికి తన సొంత ఊరు షోలాపూర్‌కి కోట్నిస్ వెళ్లాడు. అతనిని చూడటానికి చాలామంది వచ్చారు. అతను బయలుదేరినప్పుడు, "దృఢ చిత్తంతో ముందుకు వెళ్లు. మధ్యలో వదిలిపెట్టకు!" అని అతని తండ్రి ధైర్యం చెప్పాడు. అమ్మను ఎప్పుడూ మరిచిపోవద్దు అన్న మాటలు చెక్కిన వెండి గ్లాసుని అతని తల్లి ఇచ్చింది.




వైద్య బృందానికి వీడ్కోలు చెప్పటానికి కార్మికులు, విద్యార్థులు, రకరకాల పనులు చేసుకునే ప్రజలు విప్లవ పాటలు పాడుతూ పెద్ద ఊరేగింపు నిర్వహించారు. “భారత, చైనా ప్రజలు అన్నదమ్ములు!” అంటూ నినాదాలు చేశారు. వైద్య బృందం ప్రజల దౌత్యవేత్తలు అని భారత జాతీయ కాంగ్రెస్ నాయకురాలు సరోజినీ దేవి పేర్కొన్నారు. కోట్నిస్ కన్నీటి పర్యంతం అయ్యాడు.



1938 సెప్టెంబరు 1 అర్ధరాత్రి పి. & ఒ. లైనర్ ఎస్. ఎస్. రాజ్‌పుటానాలో బొంబాయి నుంచి వైద్య బృందం బయలు దేరింది. అందులో మొత్తం అయిదుగురు ఉన్నారు: డా. ఎ. అటల్, బృంద నాయకుడు; డా. ఎం. చోల్కర్, బృంద ఉప నాయకుడు; డా. డి. ముఖర్జీ; డా. బి. కె. బసు; డా. డి. ఎస్. కోట్నిస్.



సముద్రం మీద స్టీమరులో ప్రయాణం చేస్తున్నప్పుడు చీనీ-ఇంగ్లీషు పదాలతో ఒక నోటు పుస్తకాన్ని కోట్నిస్ నింపేశాడు. "వాలంటీర్ల కవాతు" అన్న చీనీ పాట పాడటం నేర్చుకున్నాడు. ఆ కారణంగా అతనికి "స్కాలర్" అన్న ముద్దు పేరు వచ్చింది.



భవిష్యత్తులో తమ పనికి సన్నద్ధంగా ఉండటానికి తాను పాఠశాలలో నేర్చుకున్న సైనిక వ్యాయామాలను తోటి కామ్రేడ్లకు నేర్పించటానికి ముందుకు వచ్చాడు కోట్నిస్. ఈ వ్యాయామాలకు అతను చాలా ప్రాముఖ్యతను ఇచ్చేవాడు. ఉపాధ్యాయుడిగా చాలా నిక్కచ్చిగా ఉండేవాడు. అందుకే, "కల్నల్" అన్నది అతని రెండవ ముద్దు పేరు అయ్యింది.




పదిహేడు రోజుల తరవాత స్టీమర్ గువాంగ్‌జౌ చేరుకున్నప్పుడు వాళ్లని కలవటానికి మేడం సూంగ్ చింగ్ లింగ్ వచ్చారు. "జౌ ఎన్‌లైని కలవటానికి మమ్మల్ని వుహాన్ పంపించండి. ఎనిమిదవ మార్గ సైన్యంతో పని చెయ్యటానికి ఆయన మమ్మల్ని పంపిస్తాడు," అని మేడం సూంగ్‌కి డా. అటల్ గుసగుసగా చెప్పాడు. వాళ్ల పక్కనే ఉన్న కోట్నిస్ నవ్వుతూ ఉన్నాడు.



చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర వర్గ సైనిక కమిషన్‌కి ఉపాధ్యక్షుడు అయిన జౌ ఎన్‌లై చైనాకి సహాయంగా భారత దేశం నుంచి వచ్చిన వైద్య దళ సభ్యులందరిని 1938 అక్టోబరు 7న కలిశాడు. కామ్రేడ్ జౌ ఎన్‌లై కోట్నిస్‌కి ఎంతో స్నేహశీలిగా కనిపించాడు. కోట్నిస్‌కి 28 ఏళ్లే అని తెలుసుకుని, "అయితే నువ్వు చైనా, భారత ప్రజల స్నేహ సంబంధాలకు చాలా పని చెయ్యగలవు," జౌ ఎన్‌లై నవ్వుతూ అన్నాడు.




అయితే, వాళ్లని నేరుగా యుద్ధ ప్రాంతానికి పంపించటానికి జౌ ఎన్‌లై ఒప్పుకోలేదు. కువోమింటాంగ్ ఆధీనంలో ఉన్న చాంగ్‌కింగ్ ప్రాంతంలో కొంత కాలం పని చెయ్యమని సూచించాడు. ఇలా జరుగుతుందని కోట్నిస్ ఏమాత్రం అనుకోలేదు.




కొన్ని నెలల తరవాత భారత వైద్య సహాయక బృందం చాంగ్‌కింగ్ వదిలి యానాన్ వెళ్లే ఏర్పాటు జౌ ఎన్‌లై చేశాడు. బయలుదేరేముందు బృంద సభ్యులందరూ చైనా పట్ల తమ ప్రేమను చూపించటానికి తమ పేర్లకు “చైనా" అని అర్థం వచ్చే హువా అన్న పదాన్ని జోడించుకున్నారు. కోట్నిస్ చీనా పేరు కె డిహువా.




యానాన్‌కి బయలుదేరే రోజు కోసం కోట్నిస్ ఎదురు చూస్తున్నాడు. “ఈ ఉత్తర చైనా యాత్రలో ప్రస్తుత ప్రపంచంలో కొత్త రాజకీయ శక్తిని – కమ్యూనిజంని నా కళ్లతో చూస్తానని అనుకుంటున్నాను,” అని తండ్రికి కోట్నిస్ ఉత్తరం రాశాడు.




యానాన్‌కి బయలుదేరటానికి ఒక రోజు ముందు తండ్రి చనిపోయాడన్న దుఃఖ వార్తని తెలియచేసే ఉత్తరాన్ని కోట్నిస్ అందుకున్నాడు. తండ్రి అంత్యక్రియలలో పాల్గొనటానికి భారత దేశం తిరిగి వెళ్లమని సహచరుల సలహాని కళ్ల నీళ్లతో కోట్నిస్ తిరస్కరించాడు. "దృఢ చిత్తంతో ముందుకు వెళ్లు. మధ్యలో వదిలిపెట్టకు!“ అన్న తండ్రి మాటలు అతనికి ఇంకా గుర్తు ఉన్నాయి.



మంచు కురుస్తూ, వైమానిక దాడులు జరుగుతున్నప్పటికీ భారత
దేశం నుంచి వచ్చిన ఈ స్నేహ దూతలకి యానాన్ సైనికులు,
ప్రజలు పాటలు, ఆటలతో 1939 ఫిబ్రవరిలో స్వాగతం పలికారు.



యానాన్ చేరుకున్న మూడవ రోజున ఎనిమిదవ మార్గ సైన్య సాధారణ వైద్య శాఖ ఒక గొప్ప స్వాగత సభను ఏర్పాటు చేసింది. “వాలంటీర్ల కవాతు" అన్న చీనా పాటను వేదిక మీద కోట్నిస్ పాడాడు. శత్రువుతో పోరాడటానికి త్వరలోనే యుద్ధభూమికి వెళ్లబోతున్నట్టు గొప్ప భావోద్వేగంతో, బలంగా కోట్నిస్ పాడాడు. ఆ సభలో ఉన్న చైర్మన్ మావో జెడాంగ్ మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.



కొంత కాలానికే ఆరోగ్య కారణంతో చోల్కర్, ముఖర్జీలు భారత దేశానికి తిరిగి వెళ్లిపోయారు. యానాన్‌లోని విప్లవ వాతావరణంతో ఉత్తేజితుడైన కోట్నిస్ అటల్, బసులతో ఉత్తర చైనాలో యుద్ధ క్షేత్రానికి వెళతామని అడిగాడు.



అయితే, దారులను శత్రువులు పకడ్బందీగా మూసివెయ్యటంతో యుద్ధ రంగంలో కాకుండా యానాన్‌కి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎనిమిదవ మార్గ సైనిక ఆసుపత్రిలో కోట్నిస్, అతని సహచరులు పని చెయ్యసాగారు. సర్జన్‌గా, రేడియాలజిస్ట్‌గా కోట్నిస్ పని చేశాడు.




జులైలో ఒక రాత్రి వాన కురుస్తుండగా జౌ ఎన్‌లై కుడి చెయ్యి విరిగిందని, వెంటనే బయలుదేరి యానాన్‌కి రావాలని అటల్, కోట్నిస్, బసులకు సందేశం అందింది. చీకటిగా ఉండి దారులు జారుడుగా ఉన్నప్పటికీ వాళ్లు గుర్రాలను ఎక్కి, సాధ్యమైనంత వేగంగా ప్రయాణం చేశారు.



కొంత కాలం చికిత్స తరవాత జౌ ఎన్‌లై కోలుకోసాగాడు. ఒక రోజు, జౌ ఎన్‌లై ఎడమ చేత్తో రాస్తూ ఉండటం చూసి భారతీయ డాక్టర్లు ఆశ్చర్యపోయారు. “అలా ఎందుకు చేస్తున్నావు?" అని వాళ్లు అడిగారు. “నేను పని చేస్తున్నాను," అని జౌ ఎన్‌లై సమాధానం ఇచ్చాడు. ఆ మాటలకు కోట్నిస్ ఎంతగానో చలించిపోయాడు.



1939లో చలి కాలం మొదలు కావటానికి ముందు ఎనిమిదవ మార్గ సైన్య ప్రధాన అధిపతి భారతీయ డాక్టర్లను యుద్ధ రంగానికి రమ్మని టెలిగ్రాము పంపించాడు. వాళ్లు బయలుదేరటానికి ముందు కోట్నిస్‌తో ఛైర్మన్ మావో చాలా సేపు మాట్లాడాడు. వాళ్లు కష్టపడి పని చెయ్యాలని, బాగా చదవాలని, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. కోట్నిస్‌ని ఇంటికి పిలిచి ఛైర్మన్ మావో స్వయంగా వండి పెట్టాడు.



యుద్ధ భూమికి ప్రయాణం చాలా కష్టంగా సాగింది. బరువు ఎక్కువ ఉన్న వాళ్ల వాహనం నవంబరు 23న కదలనని మొరాయించింది. “ట్రక్కుని మనం కష్టపెట్టాం. దానికి మూల్యం చెల్లించుకోవాలి!" అని కోట్నిస్ పరిహాసం ఆడాడు. ట్రక్కుకి తాడు కట్టి అందరూ లాగటం మొదలుపెట్టారు.



పోను, పోను దారి మరింత కష్టమౌతోంది. కొంతమంది గుర్రాల మీద, కొంతమంది కాలినడకన ప్రయాణించసాగారు. వాళ్లు మంచు, గాలులనే కాకుండా కాల్పులను కూడా ఎదుర్కొన్నారు. యుద్ధాన్ని చూడటం ఇదే మొదటిసారి అయినప్పటికీ వాళ్లు భయపడలేదు.



రెండు నెలల సుదీర్ఘ, కష్టతరమైన ప్రయాణం తరవాత వాళ్లు తమ గమ్యం చేరుకున్నారు. ఎనిమిదవ మార్గ సైనిక ప్రధాన స్థావరంలో వాళ్లకి సైనిక ప్రధాన అధిపతి జు డె స్వాగతం పలికాడు. అలసిపోయి ఉన్న ఆ బృందంలోని ప్రతి ఒక్కరితో అతను చేతులు కలిపాడు.



అమెరికా, కెనడాల వైద్య సహాయ బృందానికి నాయకుడైన డా. నార్మన్ బెథూన్ 1939 నవంబరు 12న అనారోగ్య కారణంగా యుద్ధరంగంలో చనిపోయాడు. అతని సంస్మరణ సభకి డా. కోట్నిస్ వెళ్లాడు. డా. బెథూన్ చిత్ర పటం ముందు నిలబడి, “నువ్వు నాకు ఆదర్శప్రాయుడివి,“ అని చెప్పాడు.




1940 ఆరంభంలో జబ్బుపడటంతో అటల్ భారత దేశం తిరిగి వెళ్లాడు. భారతీయ వైద్య బృందంలో మొదట వచ్చిన అయిదుగురిలో ఇప్పుడు డా. కోట్నిస్, డా. బసు మాత్రమే చైనాలో ఉన్నారు. షాంక్సి-ఖహర్-హెబై సరిహద్దు ప్రాంతంలోని వైద్య పాఠశాలకు (ఒకప్పుడు డా. నార్మన్ బెథూన్ అక్కడ పనిచేశాడు) వాళ్లని కేటాయించారు.



పాఠశాలకి వెళుతున్న దారిలో వాళ్లు భీకర ఝూంగ్డియన్ యుద్ధం వద్దకు చేరుకున్నారు. యుద్ధ రంగానికి దగ్గరలో ఒక తాత్కాలిక ఆపరేషన్ గదిని ఏర్పాటు చేశారు. తుపాకీ గుండ్ల పేలుళ్ల మధ్య నలభై ఆరు గంటల పాటు పని చేసి గాయపడిన వందలాది సైనికులకు చికిత్స చేశారు.




షిజియార్ఝువాంగ్, డెఝౌ ప్రాంతాల మధ్య శత్రువు రాకపోకలను అరికట్టటానికి రాత్రి పూట రైల్వే పట్టాలను ధ్వంసం చెయ్యటంలో స్థానిక ప్రజలకు వాళ్లు సహాయం చేశారు. ఇందుకు పికాసులు, చేతులను వాళ్లు ఉపయోగించారు.



బెథూన్ వైద్య పాఠశాల, బెథూన్ అంతర్జాతీయ శాంతి ఆసుపత్రి ఉన్న ఊరికి కోట్నీస్, బసులు ఆగస్టు 17న చేరుకున్నారు. వాళ్లకి స్వాగతం పలకటానికి ఏర్పాటు చేసిన సభలో చీనా భాషలో కోట్నీస్ మాట్లాడాడు. “ఫాసిజంకి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజల తరఫున డా. బెథూన్ లాగా నేను అంకితం అవుతున్నాను,” అని అతను చెప్పాడు.



అతని ఉపన్యాస్యాన్ని శ్రోతలు ఎంతగానో మెచ్చుకున్నారు. కోట్నిస్ స్వార్థ రాహిత్యం, నిజాయితీలు చూసి గువో కింగ్‌లాన్ అన్న అమ్మాయి చలించిపోయి ఏడ్చింది.



సెప్టెంబరులో “వంద రెజిమెంట్ల యుద్ధం" మొదలైన తరవాత చెరొక వైద్య బృందానికి నాయకత్వం వహిస్తూ కోట్నిస్, బసులు వేరు వేరు యుద్ధ రంగాలకు వెళ్లారు. బయలుదేరేముందు ఒకరికొకరు శుభాభినందనలు తెలుపుకున్నారు.



కాల్పులు జరుగుతున్న ప్రాంతానికి చాలా దగ్గరలో
ఆపరేషన్ల కేంద్రాన్ని కోట్నిస్ ఏర్పాటు చేశాడు.
మందుగుండు పొగ మధ్య వరసగా 13 రోజుల పాటు పని
చేసి, గాయపడిన 585 సైనికులకు ఆపరేషను చేశాడు.



అతను మూడు రోజుల పాటు నిద్ర పోలేదు. దాంతో,
చివరి రోగిని తీసుకుని వెళ్లిన తరవాత ఆపరేషను బల్ల
దగ్గరే అతను నిద్రపోయాడు.




బెథూన్ వైద్య పాఠశాల అధ్యక్షుడు అయిన జియాంగ్ ఇఝొన్ తన ఆరోగ్యం గురించి పట్టించుకోమని ప్రేమతో కోట్నిస్‌ని మందలించాడు. జియాంగ్ ఇఝొన్ ఫోనులో మాట్లాడుతూ ఉండగా ఏమీ చెప్పకుండా కోట్నిస్ ఆ గది లోంచి జారుకున్నాడు.



యుద్ధ రంగం నుంచి తిరిగి వచ్చిన కొన్ని రోజులకు వెంటనే భారత దేశానికి తిరిగి రమ్మంటూ కోట్నిస్, బసులకు ఒక టెలిగ్రాము అందింది. చీనా ప్రజలకు తన అవసరం ఉంది కాబట్టి తాను భారత దేశానికి తిరిగి వెళ్లనని కోట్నిస్ పట్టుపట్టాడు. యానాన్‌కి వెళ్లి కోట్నిస్ నిర్ణయాన్ని బసు తెలియచేశాడు.



శస్త్ర చికిత్సలో ఉపాధ్యాయుడిగా కోట్నిస్‌ని నియమించారు. ఇంగ్లిషు బాగా వచ్చిన గువో కింగ్‌లాన్ చీనా భాష నేర్చుకోవటంలో కోట్నిస్‌కి సహాయపడింది. బాగా కష్టపడి చదివి, పాఠాలను చీనీ భాషలో కోట్నిస్ చెప్పసాగాడు. అదే సమయంలో గువో కింగ్‌లాన్‌ని అతను ప్రేమించసాగాడు, ఆమె నుంచి దూరంగా ఉండటం అతనికి కష్టంగా ఉంటోంది.




పాఠశాలలో బోధనా సదుపాయాలు సరిగా ఉండేవి కావు. చలికాలంలో కూడా తరగతులను ఆరుబయట నిర్వహించేవాళ్లు. చలి వాతావరణం కోట్నిస్‌కి అలవాటు లేకపోయినప్పటికీ చల్లగాలి నుంచి రక్షణ ఉన్న ప్రాంతాన్ని విద్యార్థులకు కేటాయించేవాడు.



యుద్ధం మధ్య విరామం వచ్చినప్పుడు వాళ్లు తరగతులు, పశువుల మీద ప్రయోగాలు నిర్వహించే వాళ్లు. ఈ రకమైన బోధనని “సాయుధ బోధన“ అని విద్యార్థులు, ఉపాధ్యాయులు పిలిచేవాళ్లు. పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చెయ్యటానికి కోట్నిస్ బాగా ప్రయత్నించేవాడు, చాలా శ్రద్ధగా బోధించేవాడు.




1941లో పట్టా పొందిన విద్యార్థులు వెళ్లిపోయేముందు తమకు ఏదైనా రాసివ్వమని అడిగారు. “జపాను వ్యతిరేక యుద్ధంలో గెలవాలి" అని చీనా భాష లోనూ, “ప్రపంచవ్యాప్తంగా దోపిడీ ప్రజల విముక్తికి కష్టపడి చదవాలి" అని ఇంగ్లిషు లోనూ రాశాడు.



ఎర్ర సైన్యం “యాంటి-మాపింగ్" చర్యలు పూర్తి అయిన తరవాత నార్మన్ బెథూన్ అంతర్జాతీయ శాంతి ఆసుపత్రికి మొదటి డైరెక్టరుగా కోట్నిస్‌ని షాంక్సి-ఖహై-హెబై సైనిక ప్రాంత కమాండరు అయిన నీ రోంగ్‌జెన్ నియమించాడు. కోట్నిస్ దానిని ఊహించలేదు. ఆ పదవికి తాను అర్హుడు కాడని ఆందోళన పడసాగాడు. “నువ్వు మరో బెథూన్‌వి అవుతావన్న ఆశ ఉందని కమాండర్ నీ తెలియచెయ్యమన్నాడు,” అని జియాంగ్ ఇజెన్ చెప్పాడు.



అది కమాండర్, విద్యార్థుల ఆశే కాకుండా తన ఆశయం కూడా అని కోట్నిస్‌కి తెలుసు. మంచి డైరెక్టరు కావటానికి తన తోటి ఉద్యోగులు, రోగుల అన్ని రకాల అభిప్రాయాలను వినేవాడు.



స్ట్రెచ్చర్లు, ఆహార పదార్థాలు, పశువుల మేత రవాణా చెయ్యటానికి అతను స్థానిక ప్రజలను సమీకరించేవాడు. జపాను వ్యతిరేక యుద్ధం కోసం మనస్ఫూర్తిగా కోట్నిస్ పని చెయ్యటం చూసిన ప్రజలు తమను అడిగింది ఎప్పుడూ సంతోషంగా చేసేవాళ్లు.



స్థానిక ప్రజల సహకారం, ప్రాక్టీసుతో వచ్చిన అనుభవం ఆధారంగా చికిత్సా పద్ధతులను కోట్నిస్ చాలా మెరుగుపరిచాడు. గాయపడిన ఎంతోమంది సైనికులు కోలుకున్నారు. వాళ్లు యుద్ధ భూమికి వెళుతున్నప్పుడు, "ఎప్పుడూ మీకు మంచి జరగాలి!" అని కోట్నిస్ చెప్పవాడు.



నర్సుల దినోత్సవం నాడు దినపత్రికలో “ఆదర్శప్రాయ నర్స్ — నైటింగేల్" అన్న వ్యాసం కోట్నిస్ రాశాడు. ఫ్లోరెన్స్ నైటింగేల్ నుంచి ఎనిమిదవ మార్గ సైన్య వైద్యకారులు, నర్సులు నేర్చుకోవాలని అతను రాశాడు. ఆమె నుంచి అతను చాలా నేర్చుకున్నాడు.



ఒక రోజు, పొట్ట దగ్గర శస్త్ర చికిత్స చెయ్యవలసిన బాగా గాయపడిన ఒక సైనికుడిని ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. అంత క్లిష్టమైన ఆపరేషను చెయ్యటానికి తగిన పరికరాలు, అనుభవమూ లేకపోవటంతో డాక్టర్లు, నర్సులు చాలా ఆందోళన పడసాగారు.



కోట్నిస్ కూడా చాలా ఆందోళనతో ఉన్నాడు. సీనియర్ డాక్టర్ల సలహాలు తీసుకున్నాడు. కొన్ని తేలికపాటి పరికరాలు రూపొందించి అదే రాత్రికి ఆపరేషనుకు ప్రణాళిక రూపొందించాడు. తన అంగరక్షకుడు నాస్తా తెచ్చేవరకు తెల్లవారిపోయిందన్న సంగతే అతనికి తెలియనేలేదు.



కోట్నిస్ ప్రధాన సర్జన్‌గా ఆపరేషను మొదలు అయ్యింది. ఫలితం ఎలా ఉంటుందోనని ఆపరేషను గదిలో, బయటా ఉన్న వ్యక్తులు ఆందోళనపడుతూ ఉన్నారు. కానీ కోట్నిస్ చేతులు ఎటువంటి తడబాటు లేకుండా పని చేసుకుంటూ పోతున్నాయి.




ఆపరేషను విజయవంతంగా ముగిసింది. ఆ తరవాత కోట్నిస్ ఎన్నో సంక్లిష్ట ఆపరేషన్లు చేశాడు. అతనిని కమాండర్-ఇన్-చీఫ్ ఎంతగానో మెచ్చుకున్నాడు.






కోతల కాలం వచ్చేనాటికి కోట్నిస్, గువో కింగ్‌లాన్‌ల మధ్య ప్రేమ రోజు రోజుకీ పెరుగుతోంది. చలి కాలం మొదలు కాబోతుండగా ఒక రోజు కోట్నిస్ నిప్పు రాజేస్తూ ఉన్నాడు. ఆ సమయంలో, చేతిలో ఒక స్వెట్టరుతో ఇంటి లోపలికి గువో వచ్చింది. ఆ స్వెట్టరుని మంచం మీద పెట్టి, “నీ కోసం దీనిని అల్లాను,” అని చెప్పింది.


కోట్నిస్ ధన్యవాదాలు తెలిపే లోపలే గదిలోంచి గువో బయటకు వెళ్లిపోయింది. కోట్నిస్ పరుగున బయటకు వచ్చి వెళ్లిపోతున్న ఆమెను చూస్తూ ఉండిపోయాడు. అతని గుండెలో ప్రేమ దీపం వెలుగుతోంది.



సూర్యోదయపు నిశ్శబ్దాన్ని జపనీసు సైనికుల కాల్పులు బద్దలుకొట్టాయి. శత్రు దాడులు మళ్లీ మొదలయ్యాయి. ఆ సమయంలో మిలటరీ ప్రాంతంలో ఒక సమావేశంలో ఉన్న కోట్నిస్ తన గుర్రం మీద ఆసుపత్రికి వేగంగా వెళ్లాడు. రోగులను, స్థానిక ప్రజలను అక్కడి నుంచి తరలించే పనిని చేపట్టాడు.



దారిలో కోట్నిస్‌కి ఏవో మూల్గులు వినపడ్డాయి. అవి ఎవరివై ఉంటాయి? ఆ మూల్గులు వస్తున్న వైపుకి తన గుర్రాన్ని పోనిచ్చాడు.




అక్కడ ఒక మహిళ ప్రసవ వేదనలో ఉంది. ఆమెను స్ట్రెచ్చర్ మీద పెట్టమని తన అంగరక్షకుడికి కోట్నిస్ చెప్పాడు. ఆ మహిళ చెయ్యి ఊపి వాళ్లని వెళ్లిపొమ్మని చెప్పింది. లేకపోతే శత్రు సైనికులు వాళ్లని చుట్టుముట్టే ప్రమాదం ఉంది. “ఎనిమిదవ మార్గ సైనిక డాక్టర్లం. నిన్ను ఒంటరిగా ఇక్కడ వదిలిపెట్టి వెళ్లం!” అని డాక్టర్ కోట్నిస్ చెప్పాడు.



ఆమెను సురక్షితమైన చోటుకి తరలించారు. అందమైన ఒక పాపాయికి ఆమె జన్మని ఇచ్చింది. ఆమె కోట్నిస్ వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. అక్కడ ఉన్న వాళ్లంతా నవ్వుతూ ఉన్నారు. ఈ పాపని చైనా-భారత స్నేహానికి పూసిన పువ్వుగా పేర్కొన్నారు.



యుద్ధం కొనసాగటంతో తన బృందాన్ని కోట్నిస్ మారుమూల కొండ ప్రాంతానికి తీసుకుని వెళ్లాడు. దారిలో వాన పడుతూ ఉంటే తన గడ్డి టోపీని గాయపడిన ఒక సైనికుడికి ఇచ్చి తాను తడుస్తూ ప్రయాణం కొనసాగించాడు కోట్నిస్.



వాళ్ల శిబిరాన్ని గుర్తించిన శత్రువులు దాని మీద బాంబులతో దాడి చేశారు. ఆ దాడిలో కొంతమంది చనిపోయారు, కొంతమంది గాయపడ్డారు. చనిపోయిన వాళ్లని పాతిపెట్టి ప్రాణాలతో బయటపడిన కోట్నిస్, ఇతరులు స్థిరంగా ముందుకు సాగిపోయారు.



ప్రధాన కమాండర్ నీ రోంగ్‌జెన్ నుంచి వార్తాహరుడు ఒక సందేశం తీసుకుని వచ్చాడు. వైస్ సెక్రటరీ-జనరల్ తీవ్రంగా గాయపడ్డాడని, సహాయం అవసరం అన్నది ఆ వార్త సారాంశం.



ఒక ఇన్‌టర్న్, కొంతమంది నర్సులతో కోట్నిస్ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నాడు. గాయపడిన వ్యక్తికి అత్యవసర చికిత్స చేసి ముళ్ల పొదలు ఉన్న దారిగుండా అతనిని అక్కడి నుంచి తరలించారు.




పోను, పోను దారి మరింత కష్టతరంగా మారింది. అందరూ పూర్తిగా అలిసిపోయి ఉన్నారు. కోట్నిస్ కూడా దానికి మినహాయింపు కాదు, అతని తల తిరుగుతూ ఉంది.




కానీ వాళ్లు ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోటానికి లేదు. నడక ఆపితే నిద్ర వాళ్లని కమ్ముకుంటుంది. చైనా జాతీయ గీతాన్ని కోట్నిస్ పాడటం మొదలుపెట్టాడు: “లేవండి! బానిసలుగా బతకటం ఇష్టంలేని వాళ్లందరూ లేవండి..." ఒకరి తరవాత ఒకరు అతనితో గొంతు కలిపారు. ఆ పాట వాళ్లకి ఆత్మవిశ్వాసాన్ని, నడక కొనసాగంచటానికి శక్తిని ఇచ్చింది.



ఎట్టకేలకు వాళ్లకి సురక్షితమైన గుహ ఒకటి కనిపించింది. గాయపడిన వ్యక్తిని ముందు పరీక్షించిన తరవాత ఎండు గడ్డి మీద కోట్నిస్ నిద్రపోయాడు. అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో అతని ముందు మాంసం కూర ఉంది. అతను ముందుగా ఒక గిన్నె నిండా మాంసాన్ని రోగికి ఇచ్చాడు...




ఉన్నట్టుండి అడుగులు చప్పుడు వినిపించటంతో అతనికి మెలకువ వచ్చింది. నిజాయితీపరుడైన ఒక రైతు మంచులాంటి ఉప్పు ఉన్న ఒక గిన్నె అతనికి ఇచ్చాడు. ఇతర రైతులు అతనికి గుమ్మడికాయలు తెచ్చారు. కోట్నిస్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "ఏం మనుషులు, ఎలాంటి మనుషులు!" అని అతను మనస్సులో అనుకున్నాడు.



రోజు రోజుకీ వైస్ సెక్రటరీ-జనరల్ ఆరోగ్యం మెరుగుపడుతూ ఉంది. రైతుల సహృదయానికి బదులుగా జబ్బుపడినవారికి చికిత్స చేయటానికి ఊళ్లకి వెళ్లటానికి ఇప్పుడు కోట్నిస్‌కి సమయం దొరుకుతోంది. ఒక రోజు గుహకి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక రోగిని చూడమని కోట్నిస్‌కి విన్నపం వచ్చింది.



ఒక రాత్రంతా కోట్నిస్ ఆ ఊరిలో గడిపాడు. ఉదయానికి గుహకి చేరుకోగానే కోట్నిస్ కుప్పకూలిపోయాడు. పరుగున అతని వద్దకు వెళ్లిన ఒక ఇన్‌టర్న్ కోట్నిస్ నోరు గట్టిగా బిగుసుకుపోయి ఉండటం, కాళ్లు, చేతులు అదురుతుండటం, కంటిపాప పెద్దగా కావటం గమనించాడు.



మూర్ఛ రోగం! జబ్బు ఏమిటో ఇన్‌టర్న్ వెంటనే గుర్తించగలిగాడు. ఒకసారి బద్ద పురుగుని కోట్నిస్ తమకు చూపించటం అతనికి గుర్తు ఉంది. బద్ద పురుగుల సమస్య కోట్నిస్‌కి ఉందని వాళ్లకు తెలుసు. అయితే, అతనికి మూర్ఛ రోగం కూడా ఉందని వాళ్లకి తెలియదు. “ఈ విషయం ముందుగానే మాతో ఎందుకు చెప్పలేదు?" ఇన్‌టర్న్ తనలో తాను అనుకున్నాడు.



ఆ విషయం తెలియటంతో రోగులకు ఇచ్చే ప్రత్యేక ఆహారం తీసుకోమని కోట్నిస్‌తో వైస్ సెక్రటరీ-జనరల్ చెప్పాడు. కానీ, కోట్నిస్ అందుకు ఒప్పుకోకుండా, “ఇక్కడ మీరు ఒక రోగిగా ఉన్నారు. కాబట్టి నా హోదా పెద్దది. నేను చెప్పేది మీరు వినాలి,” అంటూ బదులు ఇచ్చాడు.



“శత్రు వ్యతిరేక చర్యలను" సైన్యం పూర్తి చేసిన తరవాత కోట్నిస్, గువో కింగ్‌లాన్‌లు పెళ్లి చేసుకున్నారు. చీనా సంప్రదాయం ప్రకారం వాళ్ల గదిని అలంకరించారు. “సంతోషం" కాగితం బొమ్మలను కిటికీలకు అతికించారు. త్వరలోనే పిల్లలను కనాలని వాళ్ల మంచం మీద పల్లీలు, ఖర్జూరాలు ఉంచారు. కోట్నిస్‌ని చీనా వాళ్ల అల్లుడు అంటూ ముసలివాళ్లు నవ్వారు.



అభినందించటానికి వచ్చిన వాళ్లు వెళ్లిన తరవాత ఏవో ఆలోచనల్లో మునిగిపోయినట్లు కోట్నిస్ కనిపించాడు. “అమ్మను ఎప్పుడూ మరిచిపోవద్దు" అన్న మాటలతో అమ్మ ఇచ్చిన వెండి గ్లాసును అతను బయటకు తీశాడు. చైనాకి బయలుదేరేముందు తన కుటుంబం, బంధువులతో దిగిన ఫొటోలు చూశాడు. “ఒకసారి మనం భారత దేశం వెళ్లి అందరినీ కలవాలి,” అని భార్యతో అన్నాడు కోట్నిస్.




షాంక్సి-ఖహర్-హెబై సరిహద్దు ప్రాంతానికి 1942 చాలా గడ్డు సంవత్సరం అయ్యింది. ఆసియా మొత్తాన్ని ఆక్రమించాలన్న తమ కోరికను సాధించుకోటానికి ఉత్తర చైనా మీద జపాను తన దాడులను తీవ్రతరం చేసింది. తరచు జరుగుతున్న ఈ దాడుల కారణంగా ఎనిమిదవ మార్గ సైన్యం తీవ్ర ఆహార కొరత ఎదుర్కోసాగింది. చెట్ల బెరడు, ఆకులతో తమ ఆకలి తీర్చుకోవాల్సి వచ్చేది.



తోటి చైనీయులు తినే చిరు ధాన్యాలు, నల్ల చిక్కుళ్లనే కోట్నిస్ కూడా తినేవాడు. ఒక రోజు ఒక సహోద్యోగి అతని కోసం ప్రత్యేకంగా అన్నం వండి, తెచ్చాడు. ఎప్పుడూ శాంతంగా ఉండే కోట్నిస్‌కి బాగా కోపం వచ్చింది. "నన్ను అతిథిగా చూడటం ఇష్టం లేదు!" అని అతను చెప్పాడు.



కానీ, విదేశీయుడు కావటంతో అతనికి కొంత బియ్యం, పిండి ఇచ్చేవాళ్లు. దానిని అతను తీసుకునేవాడు, కానీ దానిని జబ్బుగా ఉన్న యజమాని కొడుకుకి ఇచ్చేవాడు. బాగా గాయపడిన వాళ్ల కోసం తన అలవెన్సు నుంచి తరచు పోషకాహారం కొని తెచ్చేవాడు.




ఆ కష్ట కాలంలో ఎప్పుడో కాని మాంసం ఉండేది కాదు. ఒక రోజు దానిని వడ్డించినప్పుడు తన వంతుని మలేరియాతో బాధపడుతున్న నర్సులకు కోట్నిస్ ఇచ్చాడు. అతనికి తన వంతు మాంసం లేకుండా చెయ్యటం నర్సులకు ఇష్టం లేదు. అయితే వాళ్లు మొత్తం తినే వరకు కోట్నిస్ వదిలిపెట్టలేదు.



ఆహారం అందకుండా శత్రువులు మూసేసిన దారులను అధిగమించటానికి శత్రువులు ఆక్రమించిన ప్రాంతం నుంచి ఆహార ధాన్యాలు తీసుకుని రావటానికి ఆసుపత్రి, బడిలోని యువతతో ఒక బృందం ఏర్పాటు చేశారు. వాళ్ల తోపాటు వెళ్లబోతున్న కోట్నిస్‌ని జియాంగ్ ఇఝెన్ చూశాడు.





తమతో పాటు కోట్నిస్ రావటం జియాంగ్ ఇయెూన్‌కి ఇష్టం లేదు. కానీ, “నేను ఆసుపత్రికి డైరెక్టరుని. నా తోటి వాళ్లతో సవాళ్లను ఎదుర్కోకూడదా!" అని కోట్నిస్ అన్నాడు. చివరికి తమతో పాటు కోట్నిస్‌ని జియాంగ్ ఇయెూన్ తీసుకుని వెళ్లవలసి వచ్చింది.

రాత్రి అంతా నడిచిన తరవాత వాళ్లు తమ గమ్యాన్ని చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో వాళ్లంతా బాగా అలసిపోయి ఉన్నారు. వాళ్లల్లో ఉత్సాహాన్ని నింపటానికి కోట్నిస్ తన నెత్తి మీద ఒక ధాన్యపు మూటను పెట్టుకుని భారత దేశ జానపద గీతం పాడసాగాడు. అలసిపోయి ఉన్న అందరి ముఖాలలో నవ్వులు పులుముకున్నాయి.




ఆశావహుడైనప్పటికీ కోట్నిస్ జబ్బు ముదురుతోంది. చికిత్స కోసం మరొక చోటుకి వెళ్లాలని ప్రధాన కమాండర్ నీ రోంగ్‌ఝెన్ కోరాడు. ఎక్కడికీ వెళ్లనని తేల్చి చెప్పిన కోట్నిస్, “నేను ఇక్కడ చనిపోతే భారత దేశ ప్రజలు, నా బంధువులు నన్ను తలుచుకుని గర్వపడతారు,” అని అన్నాడు.




కమ్యూనిస్టు పార్టీలో చేరటానికి కోట్నిస్ దరఖాస్తు చేసుకున్న వెంటనే అతనిని పార్టీ సభ్యుడిగా చేర్చుకున్నారు. పార్టీ సభ్యత్వం కోసం సిఫారసు చేసిన జియాంగ్ ఇఝెన్ చెయ్యి పట్టుకుని, “సమత, స్వేచ్ఛ, సంతోషాలతో నిండిన చైనా కోసం చీనా ప్రజలతో కలిసి పోరాడతాను,” అని ఉత్సాహంగా చెప్పాడు.



ఇప్పుడు కోట్నిస్ మరింత కష్టపడసాగాడు. శస్త్ర చికిత్సకు సాధారణ పరిచయం అన్న పేరుతో ఒక పుస్తకాన్ని సంకలనం చేసే పనిని 1942 వేసవిలో మొదలుపెట్టాడు. వాతావరణం తేమగా, తడిగా ఉంది. దోమలు కుట్టకుండా ఉండటానికి తలకి గాజుగుడ్డ ముసుగుని కోట్నిస్ వేసుకునేవాడు.



ఆగస్టులో గువో కింగ్‌లాన్ పండంటి బాబుకి జన్మనిచ్చింది. నలుపు ముఖం, లోతుకి ఉన్న కళ్లతో అతను అచ్చం తండ్రి పోలికే. "పెరుగు, తొందరగా పెరిగి భారత దేశం వెళ్లి మీ నాయనమ్మను చూడు," అని పిల్లవాడితో కోట్నిస్ తరచు అంటుండేవాడు.



శరద్ రుతువులో శస్త్ర చికిత్సకి సాధారణ పరిచయం పూర్తి చేసిన తరవాత వివరంగా శస్త్ర చికిత్స అన్న పుస్తకంపై కోట్నిస్ పని చెయ్యసాగాడు. కోట్నిస్‌కి తన కొడుకు అంటే ఎంతో ప్రేమ. కొడుకు నుదుటిపై ముద్దు పెట్టి వెంటనే పనిలోకి దిగిపోయేవాడు. కొత్త పుస్తకం ప్రచురణతో కొడుకు పుట్టిన వేడుక జరపుకోవాలని అతను అనుకున్నాడు.



1942 డిసెంబరు 8న మంచు తుఫానులో తన సహాయకుడితో కలిసి ఒక గ్రామస్థుడికి ఆపరేషను చెయ్యటానికి కోట్నిస్ వెళ్లాడు.



ఆ ఉదయం అంతా అక్కడ గడిపి మధ్యాహ్నానికి తిరిగి వచ్చాడు. విశ్రాంతికి అలా నడుము వాల్చాడో లేదో మరొక రోగిని చూడాలన్న కబురు వచ్చింది. కోటు గుండీలు పెట్టుకుంటూనే మంచులో మళ్లీ కోట్నిస్ బయలుదేరాడు.




రాత్రి భోజనం తరవాత తన నాయకులలో ఒకరితో పని గురించి చర్చించాడు. తరవాత పుస్తకం రాసే పనిలో పడిపోయాడు. చేతులు బాగా చల్లబడిన కారణంగా వాటిని మాటిమాటికీ ఊదుకుంటూ ఉన్నాడు.



ఒక కాగితం మీద 177 అన్న పేజీ నంబరు వేసిన తరవాత అతను నేల మీదకి పడిపోయాడు. అతని చేతిలోంచి పెన్ను జారిపోయింది, కాగితాలు అన్నీ చెల్లాచెదురు అయిపోయాయి. అంత తీవ్రంగా ఫిట్లు రావడం అదే మొదటిసారి.



స్పృహలోకి వచ్చిన తరవాత చుట్టూ అతనికి చాలా పరిచయమైన ముఖాలు కనిపించాయి. లేచి కూర్చుని వాళ్లందరికీ కృతజ్ఞతలు తెలపాలని అనుకున్నాడు. కానీ ఏమాత్రం ఓపిక లేని కారణంగా అతని తల వెనక్కి వాలిపోతూ ఉంది. ఎంతో కష్టం మీద, "నన్ను చూడటానికి వచ్చినందుకు ధన్యవాదాలు," అని చెప్పగలిగాడు.



అతనిని కాపాడటానికి చేసిన ఏ ప్రయత్నమూ ఫలించలేదు. అతని విలువైన జీవితం 1942 డిసెంబరు 9 ఉదయం 6.15కి ముగిసిపోయింది. తోటి ఉద్యోగులను, భార్యని, 3.5 నెలల కొడుకు ఇన్ హువా (దీని అర్థం భారత్-చైనా)ని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. చనిపోయేనాటికి కోట్నిస్‌కి ముప్పైరెండు ఏళ్లే.



చీనా సాంప్రదాయ పద్ధతిలో యానాన్‌లో కోట్నిస్
అంత్యక్రియలు చేపట్టారు. జపనీయుల బాంబు దాడులు
జరుగుతూ ఉన్న నేపథ్యంలోనే అతనికి సమాధి కట్టారు.



చైనా అంతటా ప్రజలు ఎంతగానో దుఃఖించారు. అతని స్మృతిలో చైర్మన్ మావో ఒక వ్యాసం రాశాడు. యానాన్‌లో అంత్యక్రియలకు ఝు డె హాజరై స్మారకోపన్యాసం చేశాడు. ఆ సమయంలో చోంగ్‌కింగ్‌లో ఉన్న జౌ ఎన్‌లై, సూంగ్ చింగ్ లింగ్ కోట్నీస్ కుటుంబానికి, భారత జాతీయ కాంగ్రెస్‌కి వేరు వేరుగా సంతాప సందేశాలు పంపించారు.



1976లో కోట్నీస్ 34వ వర్ధంతి సందర్భంగా అతను మొదటి డైరెక్టరుగా పని చేసిన బెథూన్ అంతర్జాతీయ శాంతి ఆసుపత్రిలో కోట్నీస్ స్మారక హాల్‌ని ఆవిష్కరించారు. చీనా ప్రజల హృదయాలలో డాక్టర్ ద్వారకానాథ్ శాంతారాం కోట్నీస్ జ్ఞాపకాలు ఎల్లప్పటికీ నిలిచి ఉంటాయి.







Paperback: ISBN 0-8351-1899-1